
సాక్షి ఆదిలాబాద్

గురువారం । 21 । డిసెంబర్ । 2023



'కడెం' క్రాప్ హాలీడే 8లో▸

కడెం ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గిపోయాయి. ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీలున్నా చివరి ఆయకట్టుకు నీరందలేదు.

26 వరకు సీపీఐ ఆవిర్భావ వేడుకలు

ఎదులాపురం: సీపీఐ ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకుడు గణపతితో కలిసి బుధవారం జెండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి 26 వరకు పట్టణ, మండల, గ్రామ స్థాయిల్లో అరుణ పతాకాలను ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
26.0/12.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రతతో పాటు గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగ మంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

ఆదిలాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఉండి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. ఏదైనా సబ్జెక్టులో అనుమానాలు ఉంటే వెంటనే సంబంధిత ఉపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు తదితరులున్నారు.

నేరడిగొండ పాఠశాలలో విచారణ



విద్యార్థులతో మాట్లాడుతున్న సమితి సభ్యులు

నేరడిగొండ: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంరక్షణ సమితి సభ్యులు బుధవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలపై చైల్డ్ వెల్ఫేర్ కమిటీ స్పందించి డీసీపీయూను సమగ్ర విచారణకు ఆదేశించింది. దీంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు జగదీశ్వర్‌రెడ్డి తమపై అసభ్యంగా ప్రవర్తించినట్లు వివరించారు. ఈవిషయమై విద్యార్థుల ద్వారా పత్రం రాయించుకొని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో చైల్డ్ అండ్ కోఆర్డినేటర్ సతీష్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ: రైతులు గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి ఎన్.రమేశ్ అన్నారు. మండలంలోని లింగట్ల గ్రామంలో వ్యవసాయ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో గంజాయి సాగు నిర్మూలనపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి సాగు చేస్తే వారికి రైతుబంధు పథకం నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో బోథ్ ఏడీఏ శ్రీధర్‌స్వామి, ఎక్సైజ్ ఎస్సై చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి భాస్కర్, ఏఈఓ గజేందర్, నేరడిగొండ పాక్స్ చైర్మన్ కిశోర్, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ రిప్‌ల ఆందోళన



ధర్నా చేస్తున్న మెడికల్ రిప్‌లు

కైలాస్‌నగర్: సేల్స్ ప్రమోషన్స్ ఎంప్లాయాస్ యాక్ట్– 1976ను పునరుద్ధరించాలని మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మెడిసిన్, వైద్య పరికరాలపై జీఎస్టీ రద్దు చేయాలనే డిమాండ్‌తో బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ విధించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం పడుతుందన్నారు. చట్టబద్ధమైన పని విధానాలను రూపొందించాలని, అమ్మకాల పేరిట ఒత్తిళ్లు, వేధింపులకు గురిచేయవద్దన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామ్‌జీ, సత్యనారాయణ, సంపత్, నాగారాజు తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ జిన్నింగ్‌లో వాహనాల నుంచి పత్తిని అన్‌లోడ్ చేస్తున్నారిలా..(ఫైల్)

కుమ్మక్కయ్యారు..!

- పత్తి కొనుగోళ్లలో రింగైన సీసీఐ, మార్కెటింగ్, వ్యాపారులు
- సీసీఐ లీజుకు తీసుకున్న జిన్నింగ్‌ల లోనూ వ్యాపారుల కొనుగోళ్లు!
- గూడు పుఠాణిగా మారి రైతులను దోచుకుంటున్న వైనం

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో ఏ, బీ అనే రెండు సెంటర్ల ద్వారా ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తుంది. ఇక్కడ 17 జిన్నింగ్ ఫ్యాక్టరీలు అద్దెకు తీసుకొని రైతుల నుంచి పత్తిని కొంటుంది. అయితే సీసీఐ అద్దెకు తీసుకున్న ఈ జిన్నింగ్‌లలో ప్రైవేట్ వ్యాపారులు కూడా కొనుగోలు చేయడం గమనార్హం. అంటే ఒక పక్కన సీసీఐ, మరోపక్కన వ్యాపారులు తమ తమ కొనుగోళ్లు సాగిస్తున్నారు. ఇదంతా నిబంధనల ప్రకారమే జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మద్దతు ధర లోపే మార్కెట్లో ధర పలుకుతుంది. దీంతో సీసీఐయే అత్యధికంగా పత్తిని కొనుగోలు చేస్తుందని, వ్యాపారులు నామమాత్రంగా కొనుగోళ్లు చేస్తున్నట్లు అధికారులు పైకి చెబుతున్నారు. దీనికి భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. ఆదిలాబాద్‌లో సీసీఐ లక్ష క్వింటాళ్ల వరకే ఇప్పటివరకు కొనుగోళ్లు చేయగా, వ్యాపారులు రెండు లక్షల క్వింటాళ్లు దాటిపోయాయి. మరి అధికారులు లెక్కల పరంగా ఈ లోగోట్టు ఏంటో అర్థంకాని పరిస్థితి.

రింగై రైతులను లూటీ..

పైకి చూస్తే పత్తి కొనుగోళ్లు అంతా సాఫీగా జరుగుతుందని అనిపిస్తుంది. లోన మాత్రం అంత గూడు పుఠాణియే. మార్కెట్లో సీసీఐ, మార్కెటింగ్, వ్యాపారులు మిలాఖతై రైతులను నిండా ముంచుతున్నారన్న విమర్శలు ఆదిలాబాద్‌లో బాహాటంగానే వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో తూకం చేసే కాంటా 30 కిలోల నుంచి 60 కిలోల వరకు తక్కువగా చూయించడం వంటి మోసం బయట పడింది. కాంటాలలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన మార్కెటింగ్ అధికారుల లోపాయికారితనం ఇక్కడ బయట పడింది. ఇక సీసీఐ సాధారణంగా జిన్నింగ్‌లను లీజుకు తీసుకొని అక్కడ వ్యాపారుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తుంది. అయితే ఆ జిన్నింగ్‌లను అద్దెకు ఇచ్చిన వ్యాపారులు కూడా పక్కపక్కనే రైతుల నుంచి అక్కడే పత్తిని కొనుగోలు చేయడం విస్మయం కలిగిస్తుంది. అగ్రిమెంట్ నిబంధనలోనే ఇదంతా పొందుపర్చి ఉందని అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. అయితే ఇందులోని లొసగులను ఉపయోగించుకొని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా సీసీఐ జిన్నింగ్‌లను లీజుకు తీసుకున్నప్పుడు అక్కడ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్, బేళ్లను తయారు చేయడం జరుగుతుంది. వ్యాపారులు కూడా ఇదే కంపౌండ్‌లో పత్తిని కొనుగోలు చేస్తున్న దృష్ట్యా వారంలో కొన్నిరోజులు సీసీఐ, మరికొన్ని రోజులు వ్యాపారులు ప్రక్రియ కొనసాగించేలా నిబంధనలు ఉన్నాయని కొంత మంది చెబుతున్నారు. అయితే ఇవేమి పాటించకుండా అన్ని రోజులు సీసీఐ, వ్యాపారులు ఒకే ఆవరణలో రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తుండడమే అనుమానాలకు తావిస్తోంది. దీన్నిబట్టే సీసీఐ, మార్కెటింగ్, వ్యాపారులు రింగై రైతులను లూటీ చేస్తున్నారని బాహాటంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమాలకు ఇలా ఆస్కారం..

పత్తికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 ఉండగా, ప్రస్తుతం మార్కెట్లో ప్రైవేట్ వ్యాపారులు తేమ కొర్రి పెట్టి రైతులకు ధర తగ్గించి ఇస్తున్నారు. పలువురు రైతులకు రూ.6,300 నుంచి రూ.6,600 వరకు మాత్రమే లభిస్తుంది. ఒకే కంపౌండ్‌లో సీసీఐ, వ్యాపారులు కొనుగోలు చేసినప్పుడు అత్యధికంగా అక్రమాలకు ఆస్కారం ఉంటుందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సీసీఐ 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తుంది. అంత తేమ ఉంటేనే మద్దతు ధర నిబంధనల మేర అందుతుంది. ఇక్కడ రైతు సీసీఐ దగ్గర పత్తిని అమ్మేందుకు వెళ్లినప్పుడు తేమ అధికంగా ఉందని వారు చెప్పినప్పుడు పక్కనే వ్యాపారి ఉండడంతో అమాంతం ధర తగ్గించి ఆ రైతు నుంచి కొనుగోలు చేయడం జరుగుతుంది. ఆ కొనుగోలు చేసిన పత్తిని తిరిగి ఆ వ్యాపారి సీసీఐకు విక్రయిస్తారు. ఇదంతా లోపాయికారికంగా ఒప్పందాల మేరకు మార్కెట్లో జరిగిపోతాయన్నది సర్వసాధారణం. మొత్తంగా మద్దతు ధర లభించక రైతు మాత్రం చితికిపోయే పరిస్థితి. ఇలా పెద్ద ఎత్తున పత్తి కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని నివారించాల్సిన యంత్రాంగం పట్టి పట్టనట్టు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పత్తి కొనుగోళ్లు ఇలా..

జిల్లాలో ఇప్పటివరకు 5లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి కొనుగోళ్లు జరిగినట్టు తెలుస్తోంది. ఇందులో ప్రైవేట్ వ్యాపారులు మూడు లక్షల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయగా, వ్యాపారులు రెండు లక్షల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రధానంగా ఆదిలాబాద్ కేంద్రంగా సీసీఐ, వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు కుమ్మక్కై పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒకేచోట కొనుగోలు చేసే నిబంధనలున్నాయి..

సీసీఐ కొనుగోలు చేసే జిన్నింగ్‌లోనే సంబంధిత యజమాని అయినటువంటి వ్యాపారి కూడా పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుంది. ఇదంతా నిబంధనల మేరకే సాగుతుంది. అగ్రిమెంట్‌లో ఒప్పందం చేసుకునేటప్పుడే అందులో దీన్ని పొందుపర్చడం జరుగుతుంది. – మధుకర్, ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్ కార్యదర్శి

బదిలీలయ్యేనా..?

- ఆయా శాఖాధిపతులు మారేనా!
- దీర్ఘకాలంగా ఒకే చోట ఉన్న వారిలో గుబులు
- పలు శాఖల్లో ఏళ్లుగా ఇన్‌చార్జీల పాలనే
- సర్కారు నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ



కలెక్టరేట్

కైలాస్‌నగర్: రాష్ట్రంలో ఇటీవల కొత్త సర్కారు కొలువుదీరింది. జిల్లాలోని ప్రభుత్వ శాఖలకు నూతన సారథులు నియామకమయ్యే అవకాశముందని అధికారవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. పలు శాఖలకు ఏళ్లుగా ఇన్‌చార్జీలే జిల్లా అధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, మరికొన్ని శాఖల్లోని అధికారులు సంవత్సరాల తరబడి ఒకే చోట పాతుకుపోయారు. అలాంటి వారికి స్థానచలనం కల్పించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించేలా కసరత్తు చేస్తోంది. దీంతో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారుల్లో బదిలీపై ఉత్కంఠ నెలకొంది. అలాగే ఇన్‌చార్జీలుగా పెత్తనం సాగిస్తున్న కొంతమంది అధికారుల్లో తమ పోస్టుకు ఎక్కడ ఎసరొస్తుందనే గుబులు మొదలైంది.

పలుశాఖల్లో ఏళ్లుగా ఇన్‌చార్జీలే..

జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో కొన్నేళ్లుగా ఇన్‌చార్జీల పాలనే కొనసాగుతుంది. విద్య, వైద్య ఆరోగ్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, దళితాభివృద్ధి, వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవనం, ఉపాధి కల్పన, సహకార, సైనిక, సంక్షేమం వంటి పలు కీలక శాఖల్లో ఏళ్ల తరబడి ఇన్‌చార్జితోనే కాలం వెల్లదీస్తున్నారు. ఇందులో కొన్ని శాఖలకు రెగ్యులర్ జిల్లా అధికారుల నియామకం కాకపోగా, మరికొన్ని శాఖలకు నియామకమైనా వారు జిల్లాలో పనిచేసేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో ఆ పోస్టులు రెగ్యులర్ అధికారులతో భర్తీకి నోచుకోవడం లేదు. ఇన్‌చార్జీలే పెద్ద దిక్కుగా మారుతున్నారు. ఫలితంగా ఆయా శాఖల ద్వారా అమలు చేయాల్సిన సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై తీవ్రప్రభావం చూపనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

వీళ్లకు బదిలీలు తప్పవా...?

పలు ప్రభుత్వ శాఖల్లోని అధికారులు దీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అధికారి ఒక చోట రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నట్‌లైతే నిబంధనల ప్రకారం బదిలీ చేయాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వం ఏళ్లుగా అధికారుల బదిలీలు చేపట్టకపోవడంతో చాలామంది ఒకే చోట పాతుకుపోయారు. వీరే కాదు జిల్లా ఇన్‌చార్జి అధికారులుగా పనిచేస్తున్న వారిలో కూడా చాలామంది ఐదారేళ్లుగా అదే స్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొంత మంది రాజకీయ అండదండలతో బదిలీ కాకుండా నిలుపుకుంటున్నారు. ప్రధానంగా మున్సిపల్ కమిషనర్, డీఆర్డీవో, డీపీవో, జెడ్పీసీఈఓ, డీవైఎస్‌వో, సీపీవో, మార్కెటింగ్ ఏడీ, ఆర్‌అండ్‌బీ డీఈ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, బీసీ సంక్షేమశాఖాధికారి, ఆర్ఐవో, డిప్యూటీ డీఎంహెచ్‌వో, మైనింగ్ ఏడీ, డిప్యూటీ సీఈవో, పంచాయతీరాజ్ ఈఈ, సర్వేల్యాండ్ రికార్డు ఏడీ తదితర శాఖల అధికారుల సర్వీస్ ఒకేచోట రెండున్నరేళ్లకు పైగానే ఉంది. కొంతమంది నాలుగైదేళ్లుగా పని చేస్తున్నారు. ప్రభుత్వం బదిలీలు చేపడితే వీరిలో చాలామందికి తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇందులో కొంత మంది స్వచ్ఛందంగా వెళ్లేందుకు ఆసక్తి చూపుతుండగా మరికొంతమంది ఉన్న చోటు కాపాడుకునేందుకు ఇప్పటికే పైరవీలు షురూ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్

- ఎస్ఈ సంపత్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఈ సంపత్‌కుమార్

కైలాస్‌నగర్: రైతులతో పాటు విద్యుత్ వినియోగదారులందరికి 24 గంటల పాటు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేయాలని ఆ శాఖ జిల్లా ఎస్ఈ సంపత్ కుమార్ సూచించారు. స్థానిక విద్యుత్ తరంగిణి భవన్‌లో జిల్లాలోని విద్యుత్ శాఖ ఈఈలు, డీఈలు, ఏడీలు, ఏఈలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాకు సంబంధించి వినియోగదారుల నుంచి అందే ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించేలా శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్ బకాయిల వసూలుపై దృష్టి సారించాలన్నారు. ఈమేరకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న కనెక్షన్లను సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ ఈదన్న, ఆపరేషన్ ఈఈ హరికృష్ణ, ఎస్ఏవో దిగంబర్, ఏవో రెవెన్యూ శంకర్, ఎంఆర్‌టీ డీఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్ తదితరులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

కైలాస్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఎంపీ ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభం కానున్నందున అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాను గడువులోగా పూర్తి చేయాలని, అలాగే ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించేలా స్వీప్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లను ఇప్పటికే పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు నలంద ప్రియ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం కొనసాగించాలి

- కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

కైలాస్‌నగర్: బేలలో కేయూ డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ మండల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. బేలలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా కేంద్రానికి మార్చడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు 45 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సి వస్తుందన్నారు. కేయూ అధికారులు మా ఇబ్బందులు గుర్తించి పరీక్ష కేంద్రాన్ని బేలలో యథావిధిగా కొనసాగించాలన్నారు. అనంతరం ఆర్డీవో స్రవంతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కోవిడ్.. అలర్ట్

- మళ్లీ కరోనా గుబులు
- కలవరపెడుతున్న కొత్త వేరియంట్
- అప్రమత్తంగా ఉండాలంటున్న సర్కారు
- కట్టడి దిశగా వైద్యఆరోగ్యశాఖ సమాయత్తం



రిమ్స్‌లో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసే కేంద్రం

జిల్లాలో కోవిడ్ టెస్టుల వివరాలు : 7,40,181
పాజిటివ్‌గా తేలిన కేసులు : 19,707
జిల్లాలో సంభవించిన మరణాలు : 92
ఫస్ట్ డోస్ వ్యాక్సిన్ తీసుకున్నవారు : 5,52,815
సెకండ్ డోస్ వ్యాక్సిన్ తీసుకున్న వారు : 5,55,884
ప్రికాషన్ డోస్ తీసుకున్న వారు : 2,65,780

కైలాస్‌నగర్: కోవిడ్.. రెండేళ్ల క్రితం ప్రపంచాన్నే ఉక్కిరి బిక్కిరి చేసిన విషయం విదితమే. మహమ్మారి ముప్పు తప్పిందని భావిస్తున్న తరుణంలో మరోసారి తాజాగా కేసులు నమోదవుతుండడం కలకలం రేపుతోంది. జేఎన్–1 వేరియంట్ రూపంలో ముప్పు పొంచి ఉండటాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో కొత్త వేరియంట్ ప్రభావం ఇంకా కనిపించనప్పటికి కేంద్రం ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ అలర్ట్ అయింది. వైరస్ కట్టడి దిశగా ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 14న కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించిన అధికారులు జిల్లాలోని వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కోవిడ్ టెస్టుల నిర్వహణతో పాటు ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. పీపీఈ కిట్స్, మాస్కులను సిద్ధంగా ఉంచారు. వేరియంట్ బారిన పడకుండా ఉండాలంటే ముందు జాగ్రత్తలే శ్రేయస్కరమని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

కొత్త వేరియంట్ కలవరం

ప్రస్తుతం జేఎన్–1 వేరియంట్ ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. 2020–21లో ప్రబలిన కోవిడ్ వైరస్‌తో జిల్లాలో పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. వేలాది మంది వైరస్ బారిన పడి ఆసుపత్రుల్లో చేరాల్సి వచ్చింది. రెండేళ్లుగా కొత్తగా కేసులేమి నమోదు కాకపోవడంతో కోవిడ్ ముప్పు పూర్తిగా తొలగిపోయిందని అందరూ భావించారు. అయితే వైరస్ మళ్లీ కొత్త రూపంలో నమోదు కావడం జిల్లావాసులను కలవరానికి గురిచేస్తోంది. శీతాకాలం కావడంతో పాటు ఈ నెలాఖరు వరకు శుభ కార్యాలు ఎక్కువగా ఉండటం, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు రానున్నాయి. వీటిల్లో జనం పెద్ద సంఖ్యలో గుమిగూడే అవకాశముంటుంది. దీంతో వైరస్ వ్యాప్తి చెందే అవకాశముండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అయితే మాస్కులు ధరించడంతో పాటు భౌతిక దూరం వంటి జాగ్రత్తలు పాటించడం ద్వారా వైరస్ నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

కట్టడికి వైద్యారోగ్యశాఖ సన్నద్ధం

ప్రమాదకరమైన కొత్త వేరియంట్ కట్టడికి జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఈ నెల 14న మాక్ డ్రిల్ నిర్వహించింది. జిల్లా కేంద్రంలోని రిమ్స్ బోధనాసుపత్రితో పాటు పీహెచ్‌సీలు, యూహెచ్‌సీలు, సివిల్ కమ్యూనిటీ ఆసుపత్రులు కలిపి 96తో పాటు ఒక ప్రైవేట్ ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. నిర్ధారణ పరీక్షలతో పాటు పాజిటివ్‌గా తేలిన వారికి చికిత్స అందించేలా వారికి దిశా నిర్దేశం చేశారు. వైద్యులు, సిబ్బందికి అవసరమైన మాస్కులు 1,47,270, పీపీఈ కిట్స్ 12,740ని సిద్ధంగా ఉంచారు. రిమ్స్, ఇతర ఆసుపత్రుల్లో కలిపి 1436 బెడ్స్‌ను సిద్ధం చేశారు. రిమ్స్‌లో వంద పడకలతో కూడిన ఐసోలేషన్ వార్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆక్సిజన్‌తో కూడిన 455 పడకలు, 135 పడకలతో ఐసీయూ, వెంటిలేటర్స్‌తో కూడిన 157 పడకలను రిమ్స్‌లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే 19 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచనున్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలి



కొత్త వేరియంట్ కట్టడికి జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాం. వైరస్ నియంత్రణకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఇప్పటికే మాక్ డ్రిల్ నిర్వహించి ఏర్పాట్లు పూర్తి చేశాం. మాస్కులు, పీపీఈ కిట్లతో పాటు చికిత్సకు అవసరమైన మెడిసిన్‌ను అందుబాటులో ఉంచాం. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. భౌతిక దూరం పాటించడంతో పాటు మాస్కులు తప్పనిసరిగా ధరించాలి. దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకు చికిత్స పొందాలి.

– రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులు

బేల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎస్.అచల్ (ఇంటర్ సెకండ్ ఇయర్), కాసుబాయి (10వ)లు ఈ నెల 22న కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో ఎంపికైనట్లు ఎస్‌వో గేడం నవీన, పీఈటీ సీహెచ్ తాయిలు తెలిపారు. బుధవారం ఈ ఇద్దరు విద్యార్థినులు జిల్లాస్థాయి అండర్-20 విభాగంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన రన్నింగ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని సీఆర్టీలు, అధ్యాపకులు అభినందించారు.

కాంస్య పతకం సాధించిన జిల్లా జట్టు

ఆదిలాబాద్: జిల్లా హాకీ జట్టు వనపర్తిలో జరుగుతున్న 67వ ఎస్జీఎఫ్ అండర్ 17 రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో కాంస్య పతకంతో సత్తా చాటింది. సెమీఫైనల్‌లో నల్గొండ జట్టుతో జరిగిన పోరులో 2-1 గోల్స్ తేడాతో తృటిలో విజయాన్ని చేజార్చుకున్న జిల్లా జట్టు, మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ జట్టును 3-0 సున్నా గోల్స్ తేడాతో ఓడించి విజేతగా నిలిచిందని ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు తెలిపారు. జిల్లా జట్టు విజేతగా నిలవడంపై జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రణీత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, తెలంగాణ హాకీ జట్టు పరిశీలకుడు రవీందర్ అభినందించారు.

పెట్రోకార్ సిబ్బందిపై దాడి

సోన్: మండలంలోని పెట్రోకార్ సిబ్బందిపై దాడికి ప్రయత్నించిన మాధాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురిని బుధవారం నిర్మల్ మెజిస్ట్రేట్ రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్లితే.. డిసెంబర్ 15 అర్ధరాత్రి మాధాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన పెసరి మురళీ, పెసరి నవీన్, బర్మా ప్రవీణ్, పెసరి దామోదర్, మేకల నిఖిల్‌లు ఐదుగురు మద్యం సేవిస్తుండగా 100కు సమాచారం రావడంతో పెట్రోకార్ సిబ్బంది ఏపీపీ సతీష్, శేఖర్ అక్కడికి వెళ్లారు. దీంతో ఆ ఐదుగురు వ్యక్తులు పోలీస్ సిబ్బందిని బూతులు తిడుతూ, కారు మిర్రర్‌ను ధ్వంసం చేశారు. సోన్ ఏఎస్సై సంతోషం రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వారిని బుధవారం అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కుల బహిష్కరణ చేసిన వారిపై కేసు

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల గ్రామంలో కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... పడకండి రమేష్, సై రెడ్డి సుధాకర్ వ్యవసాయ భూమి విషయంలో గురుడు కాపు సంఘ సభ్యులు జోక్యం చేసుకున్నారు. పాలానికి వెళ్లే దారి విషయంలో పంచాయితీ పెట్టి తీర్పు ఇవ్వడమే కాకుండా రమేష్ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసి వారితో ఎవరైనా మాట్లాడితే జరిమానా విధిస్తామని, అయ్యప్ప మహా పడిపూజకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయమై బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు గురుడు కాపు సంఘానికి చెందిన సైకిల్ నర్సారెడ్డి, మహిపాల్, పెద్దోళ్ల రాజారెడ్డి, అద్దె శ్రీను, మగ్రాల రవి, నలిమెల సుధాకర్, పడకంటి చిన్నారెడ్డి, పడకంటి గణేష్, పడకంటి రాజు, లింగారెడ్డి, టమోటో సైరెడ్డి, సుధాకర్ అనే వ్యక్తులపై కేస్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.











కిక్కిరిసిన బస్టాండ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకంతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ మహిళా ప్రయాణికులతో కిటకిటలాడింది. కనిపించిన ప్రతీ బస్సు పోటెత్తిన ప్రయాణికులతో కనిపించింది. దాదాపు ఒకేరోజు 45వేల మంది వరకు ప్రయాణికులు ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారుల పేర్కొన్నారు. బస్సులో సీట్ల కోసం పురుషులకు ఫీట్లు తప్పలేదు. బస్సులు ప్లాట్ ఫారంపైకి రానివ్వకుండా పోటీపడి సీటు కోసం కిటికిలో నుంచి పలువురు బస్సులోకి దూరారు. ప్రమాదం ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని ఆర్టీసీ అధికారులు వాపోతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కడెం క్రాప్ హాలీడే

- ప్రస్తుతం ప్రాజెక్టులో నీటినిల్వలు 4.02 టీఎంసీలు
- 1.2 టీఎంసీలతో చెరువులు, కుంటలు నింపే యోచనలో అధికారులు
- యాసంగిలో పంటలకు నీరందించని పరిస్థితి
- నిరాశలో ఆయకట్టు రైతులు



కడెం ప్రాజెక్ట్

జన్నారం(ఖానాపూర్): కడెం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా చివరి ఆయకట్టుకు నీరందలేదు. వారబంధీ విధానంతో నీరందించారు. అయినా కొందరు రైతుల పొలాలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయి. దీంతో ప్రస్తుతం ప్రధాన కెనాల్‌కు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ రబీ సీజన్‌లో క్రాప్ హాలీడే ప్రకటించే యోచనలో అధికారులు ఉన్నారు. వేసవిలో నీటికి ఇబ్బంది రాకుండా చెరువులు, కుంటలు నింపేందుకు మాత్రమే నీటిని వదిలే అవకాశం ఉంది.

68,150 ఎకరాల్లో సాగు..

కడెం ప్రాజెక్టు ద్వారా నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68,150 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు కురియడంతో కడెం ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. నైజాం కాలంలో నిర్మించిన ప్రాజెక్టు కావడంతో గేట్లు మొరాయించడం, పలు కారణాల వల్ల వర్షాకాలంలో వచ్చిన నీరంతా వృథాగా పోయింది. మిగిలిన నీటితో ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరందించడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గింది. ప్రాజెక్టు పరిధిలోని 1 నుంచి 8 డిస్ట్రిబ్యూటరీలు కడెం, దస్తురాబాద్ మండలాలు, 9 నుంచి 22 డిస్ట్రిబ్యూటరీలు జన్నారం మండలం, 23 నుంచి 28 డిస్ట్రిబ్యూటరీలు దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలంలో నీటిని అందిస్తాయి. జన్నారం మండలంలో కడెం జలాశయంలోని డీ 9 నుంచి 22 వరకు సుమారుగా 13 వేల ఎకరాలు, డీ 22 నుంచి 28 వరకు దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరకు సుమారుగా 40 వేల ఎకరాల వరకు నీరందిస్తుంది.

చెరువులు నింపడంతోనే సరి..

కడెం జలాశయంలో నీరు లేకపోవడంతో యాసంగి సీజన్‌లో పంటలకు నీరందించే పరిస్థితి లేదు. ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో మూడు టీఎంసీల నీరు స్టోరేజీ ఉండగా కేవలం 1.02 టీఎంసీల నీటితో రబీ పంటకు నీరందించే పరిస్థితి లేదని తేల్చిచెప్పేశారు. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా రబీ సీజన్‌లో పంటలకు నీరిందించేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రస్తుతం 4 టీఎంసీల నీటితో పంటలకు సరిపడా నీరందించే పరిస్థితి లేదు. దీంతో ఉన్న 1.02 టీఎంసీల నీటితో కడెం ఆయకట్టు కింద గల చెరువులు, కుంటలను నింపి వేసవిలో నీటికి ఇబ్బంది కలుగకుండా చూసేందుకు అధికారులు యోచిస్తున్నారు. కాగా వానాకాలంలో మంచి పంటలు పండించిన రైతులు ప్రస్తుత యాసంగిలో పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే వరి నారు మడులు సిద్ధం చేశారు. ప్రాజెక్టు నీటిని వదులుతారనే ఆశతో ఉన్న రైతులకు క్రాప్ హాలీడే నిరాశ నింపే అవకాశం ఉంది.

> **ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం**
>
> కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు మాత్రమే నిల్వఉంది. ఈ నీటితో రబీ పంటలకు నీటిని వదలడం సాధ్యం కాదు. ఉన్నతాధికారులతో చర్చలు జరుగుతున్నాయి. రబీ సాగుకోసం కాకుండా ఆయకట్టు కింద చెరువులు, కుంటలు నింపేందుకు నీటిని విడుదల చేసేందుకు చర్చిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నీటిని విడుదల చేయడం జరుగుతుంది.
>
> – బోజేదాస్, డీఈ, కడెం ప్రాజెక్ట్

లంబాడాల తొలగింపుపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివాసీ ఎమ్మెల్యేలు రాజ్యాంగంలో అక్రమంగా 324 ఆర్టికల్ ఆమోదం లేకుండా ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న లంబాడాలు ఎస్టీ కాదనే అంశంపై అసెంబ్లీలో ప్రస్తావించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లంబాడాలు ఎస్టీ జాబితాలో కలిపి 47ఏళ్లు అవుతున్నప్పటికీ వారు కేవలం జీవో 149 ద్వారా నేటికీ కొనసాగుతున్నారన్నారు. కేవలం ఆదివాసీలు ఎమ్మెల్యేలుగా మంత్రులుగా గెలిస్తే ఉపయోగం లేదన్నారు. ఐటీడీఏలో జరగాల్సిన ప్రమోషన్లు, బదిలీలు 5వ షెడ్యూల్‌కి విరుద్ధంగా జీఓ 317 పేరిటా నూతన జోనల్ పద్ధతిలో ఉద్యోగులు ఆగం అవుతున్నారన్నారు. ఈ అంశాలు అన్ని మాట్లాడాల్సిన అవసరం ఆదివాసీ ఎమ్మెల్యేలపై ఉందన్నారు. లేదంటే ఆదివాసీల భవితవ్యం ప్రశ్నార్థకమవుతుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పుర్క బాపురావ్, ప్రధాన కార్యదర్శిగా వెట్టి మనోజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నైతం రమేష్‌లను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక్ విజయ్, జల్కే పాండురంగ్, సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి, పోలిట్ బ్యూరో చైర్మన్ మెస్రం మోతిరాం, సభ్యులు ఉయికే సంజీవ్, సహాయ కార్యదర్శి జంగు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు

- జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి



పోటీలను ప్రారంభిస్తున్న పార్థసారథి

ఆదిలాబాద్: అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అథ్లెటిక్స్ ఈవెంట్లో విజేతగా నిలవాలంటే నిరంతరం సాధన చేయాలన్నారు. నిత్యం సాధన చేస్తూ నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. అథ్లెటిక్స్ క్రీడల్లో గెలుపొందితే మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్ ఈవెంట్‌లో ప్రతిభను కనబరుస్తుండడం హర్షణీయమన్నారు. గొప్పగా సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మెరవాలని ఆకాంక్షించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రాజేష్ మాట్లాడుతూ అండర్ 16, 18, 20 విభాగాల్లో బాలికలు, బాలురు, మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 23వ తేదీ నుంచి కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో రాణిస్తే గయాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, శిక్షకులు రాకేష్, మజీద్, సౌమ్య ఉన్నారు.

గృహప్రవేశం చేసిన మూడురోజులకే

- గుండెపోటుతో నిద్రలోనే యువకుడి మృతి



రవి (ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన జోగు లక్ష్మి-నర్సయ్య దంపతులకు నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మూడో కుమారుడు రవి (34) గల్ఫ్ నుంచి వచ్చి పలు శుభకార్యాలను ముగించుకున్నాడు. ఆ ఆనందం తీరక ముందే గుండెపోటు రూపంలో మృత్యువు కబళించింది. స్థానికుల వివరాల ప్రకారం... నూతన గృహప్రవేశాన్ని పురస్కరించుకుని రవి నెలరోజులు సెలవుపై ఈ నెల 6న స్వదేశానికి వచ్చాడు. ఈ నెల 17న బంధువులను పిలిచి గృహప్రవేశం సైతం చేశాడు. 18న ఇంట్లో పూజలు, వ్రతాలు పూర్తి చేసుకున్నాడు. 19న బంధువులంతా ఇంట్లోనే ఉన్నారు. ఇంటికి కట్టిన పచ్చని తోరణాలు కనీసం వాడిపోకుండా అలాగే ఉన్నాయి. రాత్రి ఇంట్లో పడుకున్న అతడు నిద్రలోనే గుండెపోటుతో మృతిచెందాడు. అతడికి భార్య సుమ, కుమారుడు, కూతురున్నారు. లక్ష్మి నర్సయ్య దంపతుల పెద్ద కుమారుడు నరేందర్ విద్యుత్ షాక్‌తో 20ఏళ్ల క్రితం మృతి చెందాడు. రెండో కుమారుడు రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడు నవీన్ ప్రస్తుతం గల్ఫ్‌లో ఉంటున్నాడు. ముగ్గురు కుమారులు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు కలిచివేశాయి.

బస్సు ఎక్కుతుండగా బంగారం చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏడుతులాల బంగారం చోరీకి గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గైని మౌనిక ఆదిలాబాద్‌లోని పుట్టింటికి బయలుదేరింది. డైరెక్ట్ బస్సు దొరకపోవడంతో నిర్మల్ బస్సు ఎక్కింది. దీంతో నిర్మల్ బస్టాండ్‌లో దిగి ఆదిలాబాద్ బస్సు ఎక్కే క్రమంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆమె బ్యాగ్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఏడు తులాల బంగారం చోరీ చేశాడు. ఆమె ఒకసారి బ్యాగు చెక్ చేసుకోగానే బంగారం లేకపోవడంతో ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

శబరిమలకు మహాపాదయాత్ర



దర్శనం పూర్తి చేసుకున్న అయ్యప్పస్వాములు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి కేరళ రాష్ట్రంలోని అయ్యప్ప దేవస్థానం శబరిమలకు పాదయాత్ర ద్వారా బయలుదేరిన అయ్యప్ప స్వాముల బృందం బుధవారం చేరుకున్నారు. అనంతరం హరిహరసుతుడైన మణికంఠ దర్శనాన్ని పూర్తి చేసుకున్నారు. గత నవంబర్ 9వ తేదీన జిల్లా కేంద్రానికి చెందిన జి.శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో తలపెట్టిన మహాపాదయాత్ర దాదాపు 1500 కిలో మీటర్లు ప్రయాణించి అయ్యప్ప స్వామి క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తబృందం సభ్యులు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలతోనే 13వ సారి ఈ మహా పాదయాత్ర పూర్తి చేసుకున్నామని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సత్తి సాయన్న ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమశాఖలో విలీనం చేయడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేకశాఖ ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలని కోరారు. మహిళల మాదిరి బస్సులో దివ్యాంగులకూ ఉచిత ప్రయాణం అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ అందించడం అభినందనీయమన్నారు.

ఒకే కాంటాతో తూకం..



ఒకే కాంటా ద్వారా పత్తి తూకం చేస్తున్న దృశ్యం



పత్తి వాహనాలతో బారులు తీరిన రైతులు

- ఇబ్బందులు పడుతున్న రైతులు

నేరడిగొండ: మండల కేంద్రంలోని దర్శన జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను చేపడుతున్నారు. అయితే జిన్నింగ్ మిల్లులో తూకాలు చేయడానికి రెండు కాంటాలు ఉన్నప్పటికీ ఒకే కాంటా ద్వారా తూకం చేస్తున్నారు. దీంతో వివిధ గ్రామాల నుంచి పత్తిని తీసుకొస్తున్న రైతన్నలు బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత మార్కెట్ కమిటీ అధికారులను అడిగితే పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా రెండు కాంటాల ద్వారా తూకం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



వైష్ణవిని అభినందిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆర్.సవిత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా జోనల్ లెవెల్ అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయికి ఎంపికై హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీ సభ్యులు సరళ శ్రీనివాస్‌గౌడ్, దేవోజీ భూమేశ్, పాఠశాల చైర్మన్లు విద్యార్థినిని అభినందించారు.

సోన్: మండలం కేజీబీవీకి చెందిన పదో తరగతి విద్యార్థిని ఎం.వైష్ణవి హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు బుధవారం ప్రత్యేకాధికారి లతాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రియాంక తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన జోనల్‌స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. వైష్ణవిని ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రైవర్ అజాగ్రత్త.. విద్యార్థికి గాయాలు



గాయాల పాలైన విద్యార్థి

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై ఉదయం టాటా మ్యాక్స్ వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. బుధవారం ఇచ్చోడ వైపు నుంచి టాటా మ్యాక్స్ వాహనంలో ముత్ర గ్రామానికి చెందిన విద్యార్థులను తీసుకొస్తుండగా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో ఇందులోని ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఇచ్చోడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మారుతి వివరించారు.

అధిక సాంద్రతతో ఎక్కువ దిగుబడి



పత్తిని చూపిస్తున్న ఏడీఏ


పెంబి: పత్తిని అధిక సాంద్రత విధానంలో సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఖానాపూర్ ఏడీఏ సుజాత తెలిపారు. బుధవారం మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన రైతు అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పత్తి పంటను ఆమె పరిశీలించి మాట్లాడారు. అధికసాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే ఎకరాకు సుమారు 14క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, గతేడాది ఇదే భూమిలో పత్తి సాగు చేయగా 10క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. ఏఈవో రాజ్‌కుమార్, రైతులున్నారు.

అస్తవ్యస్తంగా బల్దియా పాలన

- అందుబాటులో ఉండని అధికారులు



పట్టణ ప్రణాళిక విభాగంలోని టీపీవో..



ఉదయం 11.30గంటలు తరువాత.. కమిషనర్ కుర్చీ

కైలాస్‌నగర్: గ్రేడ్-1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. బల్దియా అధికారులు సమయపాలన పాటించడం లేదు. ఫీల్డ్ విజిట్ పేరిట కార్యాలయానికి సకాలంలో హాజరుకావడం లేదు. మున్సిపల్ వ్యవహారాలను పర్యవేక్షించాల్సిన జిల్లా ఉన్నాతాధికారులు ఆదిశగా దృష్టి సారించకపోవడంతో బల్దియా అధికారులు విధులకు వచ్చిందే సమయం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆయా విభాగాలకు వచ్చే ప్రజలు అధికారుల్లేక ఖాళీ కుర్చీలను చూసి వెనుదిరుగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు కార్యాలయంలో ఎప్పుడు అందుబాటులో ఉంటారో కూడా తెలియని దుస్థితి తలెత్తింది. బుధవారం సాక్షి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించగా ఉదయం 11.35 గంటలు దాటినప్పటికి ఒక్క రెవెన్యూ అధికారి మినహా మిగతా అధికారులేవరూ ఆయా విభాగాల్లో అందుబాటులో లేకపోవడం బల్దియా పాలన గాడి తప్పిందనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది.



హరితహారం డీఈ కుర్చీ



పారిశుధ్య విభాగంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుర్చీ



ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న ఎంఈ కుర్చీ